క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మేరుగు



తిరుపతిరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మేరుగు నాగార్జున

చీమకుర్తి రూరల్: మండలంలోని రెడ్డి నగర్ గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త గుణపాటి తిరుపతిరెడ్డి సోమవారం కారు ఢీకొని ప్రమాద వశాత్తు మృతి చెందగా వారి కుటుంబాన్ని బుధవారం రెడ్డి నగర్ లో సంతనూతలపాడు ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. జరిగిన ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు పట్టణ పార్టీ అధ్యక్షులు కిష్టిపాటి శేఖర్ రెడ్డి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య స్థానిక నాయకులు గుణపాటి వెంకటేశ్వర రెడ్డి, నాగిరెడ్డి, చౌడారెడ్డి తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో సీసీ కెమెరాలు

మద్దిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి పారదర్శకతతో పనులు నిర్వహించేలా కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నట్లు తెలిపారు.

నేడు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ రాక

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పీ కృష్ణయ్య రానున్నట్లు ఈఈ రాఘవరెడ్డి తెలిపారు. ప్లాస్టిక్ వాడకం, పొల్యూషన్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో 4 లక్షల పది వేల మొక్కలు నాటించడానికి సంకల్పించారన్నారు. క్రమంలో గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్ వద్ద ఉన్న ఆలయ ఆవరణలో 200 మొక్కలు నాటించనున్నట్లు తెలిపారు. డీఎఫ్ఓ రాజశేఖర్ సహకారంతో నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా హాజరవుతారని చెప్పారు.

ఎస్జీటీ మోడల్ టెస్ట్‌కు అనూహ్య స్పందన



ఎస్జీటీ మోడల్ గ్రాండ్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

ఒంగోలు సిటీ: పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ సహకారంతో ప్రకాశం జిల్లా శాఖ బుధవారం ఉదయం 9 గంటలకు ఒంగోలులోని ఓ కోచింగ్ సెంటర్‌లో నిర్వహించిన ఎస్జీటీ మోడల్ గ్రాండ్ టెస్ట్‌కు అనూహ్య స్పందన లభించింది. ఈ పరీక్షలో మొత్తం 90 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రశ్న పత్రాలను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరహరి అంజిరెడ్డి ప్రారంభించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పులి శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ ఎస్జీటీ పరీక్షలో కడవకుదురు గ్రామానికి చెందిన జి.దీప్తి (126/160) మొదటి ర్యాంకును, కోడూరివారిపాలెం కు చెందిన పి.ఎస్తేరమ్మ (124/160) రెండవ ర్యాంకును, కరవది గ్రామానికి చెందిన ఐ.మౌనిక (120/160) మూడవ ర్యాంకు సాధించింది. ఒంగోలులో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తరఫున ఈ నెలలో డీఎస్సీ రాయబోయే డీఎస్సీ అభ్యర్థులకు మోడల్ టెస్ట్ నిర్వహించారు. అందులో మొదటి స్థానం సాధించిన వారికి రూ.10 వేలు, రెండో స్థానం సాధించిన వారి రూ.5 వేలు, మూడవ స్థానం వారికి రూ.3 వేలు అందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ అధ్యక్షుడు పీ శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ నరహరి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మోహన్ రావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

ఒంగోలు మెట్రో: శ్రీగిరి వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు బుధవారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు శ్రీవారికి సహస్ర నామార్చన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణగావించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, మేదినీ పూజ, మృత్సంగ్రహణం, వాస్తు హోమం, ధ్వజ దండ, ధ్వజ పట గరుడ ప్రతిష్ట తీర్మానం కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, కుమార ఆత్రేయలతో పాటు శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, ఆలూరు జై శంకర్ తదితరులు పర్యవేక్షించారు.

వెన్నుపోటుపై పెల్లుబికిన నిరసన

- అన్ని వర్గాల ప్రజల్లో వెల్లువెత్తిన ఆగ్రహ జ్వాల
- రైతులు, మహిళలు, యువకులను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు
- కూటమి ప్రభుత్వం నశించాలంటూ వైఎస్సార్ సీపీ కార్యకర్తల నినాదాలు
- ఒంగోలు ఇన్‌చార్జి చుండూరు రవిబాబు ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం



ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న చుండూరు రవిబాబు, బత్తుల బ్రహ్మనందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న తదితరులు



మీడియాతో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు, పక్కన నాయకులు

ఒంగోలు సిటీ: సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా ఇంత వరకు ఒక్క హామీ కూడా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడవడంతో కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో నిరసనలు పెల్లుబుకాయని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బుధవారం చేపట్టిన వెన్నుపోటు దినం సందర్భంగా తొలుత అంబేడ్కర్ భవన్ నుంచి ర్యాలీగా బయల్దేరి ఆర్డీఓ కార్యాలయానికి చేరుకొని ఏఓకు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం నశించాలి..అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోందన్నారు. కూటమి నాయకులు అలవిగానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించాలని ప్రజల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందని తెలిపారు. అయ్యా చంద్రబాబు..నువ్వు చెప్పిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆడపిల్లలకు ఇస్తానన్న రూ.1500, తల్లికి వందనం ఏమైందని, రైతులకు ఇస్తానన్న రూ.20 వేలు, నిరుద్యోగులకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు.. చంద్రబాబు ఉన్న ఉద్యోగాలు పీకేయడంతో పాటు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఎక్సైజ్‌లో పనిచేస్తున్న 20 వేల మంది సిబ్బందిని, రేషన్ వాహనాల డ్రైవర్లుగా కొనసాగుతున్న 9 వేల మందిని తొలగించి వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. రైతులు, మహిళలు, తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తానని, ఇలా అన్ని వర్గాల వారిని వెన్నుపోటు పొడిచిన చరిత్ర మీదే చంద్రబాబు అని అన్నారు. గత సంవత్సరం ఇవ్వని పథకాలన్నీ ఈ సంవత్సరం ఇచ్చే పథకాలతో కలిపి పెనాల్టీతో సహా ప్రజలకు ఇప్పిస్తామన్నారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌కే వెన్నుపోటు పొడిచిన చరిత్ర చంద్రబాబుదన్నారు. ప్రతి వ్యక్తికి, ప్రతి కుటుంబాన్ని వెన్నుపోటు పొడవడం సహజమైపోయిందని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ప్రజాస్వామ్యాన్ని కాలరాసే విధంగా రాక్షస రాజ్యం కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. అప్రకటిత, అత్యవసర పరిస్థితిని రాష్ట్రంలో చంద్రబాబు కొనసాగిస్తున్నారని విమర్శించారు. మహిళలు, యువకులు, రైతులు, రైతు కూలీలు, సర్వజనులు కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాహిత కార్యక్రమాలు చేసిన దాఖలాలు లేవని, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి బాధ్యతగా ఇచ్చిన హామీలన్నీ సక్రమంగా అమలు చేసే విధంగా పాలన కొనసాగించాలని కోరారు.

ఒక్క హామీనీ అమలు చేయని కూటమి

ఏపీ ఎన్జీఓల సంఘ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీ కూడా అమలు చేయని పరిస్థితి ఉందన్నారు. టమోటా రైతులు, పొగాకు రైతులు గిట్టుబాటు ధరల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాలు పడుతున్నప్పటికీ మార్క్‌ఫెడ్ నుంచి రైతులకు విత్తనాలు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. చంద్రబాబు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ఇస్తానని చెప్పారన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పీఆర్సీకి ఒక కమిటీని వేస్తే, అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా చంద్రబాబు కమిటీ వేసిన దాఖలాలు లేవన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయగా చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. చంద్రబాబు చేసిన అన్యాయానికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో విద్రోహ దినంగా పార్టీ ప్రకటించిన సందర్భంగా జయప్రదం చేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర రావు, కొత్తపట్నం మండల అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు రూరల్ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పాలడుగు రాజీవ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్ ఖాన్, ప్రవీణ్‌కుమార్, సిటీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అసోది యలమందారెడ్డి, నటారి జనార్దన్‌రెడ్డి, హౌసింగ్ బోర్డు చిన్న, దేవా, శ్రీకాంత్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, పార్టీ నాయకులు రవీంద్రారెడ్డి, వి.వెంకటేశ్వరరెడ్డి, నాగూర్, సాగర్, సిటీ డివిజన్ల అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీపీ, ఎంపీటీసీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్లకార్డులతో ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



గర్జిస్తున్న యువకులు

బాబు మోసాలకు గుణపాఠం చెప్పాలి



సంతనూతలపాడులో వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున, నాయకులు, వైఎస్సార్ సీపీ అభిమానులు

- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున
- బాబు వెన్నుపోటుపై పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ
- కదంతొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

సంతనూతలపాడు: సీఎం చంద్రబాబు అబద్ధాలు, మోసాలు మరోసారి రుజువవుతున్నాయని, వాటిని ప్రజలంతా గమనించి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ పాలనను ఎండగడుతూ వందలాది మంది కార్యకర్తలతో జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మేరుగు నాగార్జున పర్యవేక్షణలో బుధవారం 'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేరుగు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్కరికీ సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామని మోసగించారన్నారు. 50 ఏళ్లు నిండిన బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని నేడు ఆ విషయమే పట్టించుకోవడం లేదని చెప్పారు. సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని, ఉచిత బస్సుకు ముహూర్తమే ఖరారు చేయలేదని మండిపడ్డారు. ఇంటింటికీ ఉద్యోగమిస్తాం.. ఉద్యోగం ఇవ్వకపోతే నెలకు రూ.3 వేలు భృతి అన్నా నేటికీ అతీగతీ లేకుండా పోయిందని విమర్శించారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఇస్తామని ఇప్పటి వరకూ పైసా ఇవ్వలేదని అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కదంతొక్కారు. సంతనూతలపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండ్ మీదుగా తహసీల్దార్ ఆఫీసు వరకు ర్యాలీ సాగింది. అనంతరం రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్ సుధీర్‌కు వినతిపత్రం అందజేశారు.

వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అధ్యక్షత వహించగా, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొమ్మూరి కనకారావు, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు బెజవాడ రాము, నియోజకవర్గ యూత్ వింగ్ ప్రెసిడెంట్ పి.అన్వేష్, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మండలాల అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణ, మండవ అప్పారావు, నాలుగు మండలాల ఎంపీపీలు యద్దనపూడి శ్రీనివాసరావు, బి.విజయమ్మ, అరుణ కోటిరెడ్డి, అంజమ్మ కృష్ణారెడ్డి, చీమకుర్తి మున్సిపల్ గోపువరపు చంద్ర, మాజీ ఎంపీపీ నారా విజయలక్ష్మి, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు కిష్టపాటి శేఖర్‌రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ దుంపా యలమందారెడ్డి, మంచా హరికృష్ణ, ఎస్.విజయ భాస్కరరెడ్డి, వైస్ ఎంపీపీ పి.వెంకట్రావ్, వైస్ ఎంపీపీ టి.రాగమ్మ, సర్పంచ్ దర్శి నాగమణి, ఎంపీటీసీలు కె.సుబ్బారావు, టి.సుజాత, ఎన్.రాధాకుమారి, ఎల్.నాగేశ్వరరావు, మొలకలపల్లి సీతమ్మ, మున్సిపల్ వింగ్ నాయకుడు రావూరి శ్రీనివాసరెడ్డి, నాయకులు తేళ్ల పుల్లారావు, మహేష్, బాల చంద్రమౌళి, కే సుధాకర్‌రావు, కొండారెడ్డి, ఎస్.రమణమ్మ, మండవ వెంకట నారాయణ, ఆలూరి వెంకటేశ్వర్లు, జి.ఓబుల్ రెడ్డి, కాకి రవి, ఎస్.రాజేష్, జి.ఆంజనేయులు, కత్తినేని శ్రీనివాసరెడ్డి, బొడ్డపాటి శ్రీను, మొలకలపల్లి శ్రీనివాసరావు, బొక్కిసం శివరామయ్య, ఎం.సుబ్బారావు, తన్నీరు మోహన్ రావు, శివారెడ్డి, కరుకు సుబ్బారావు, వల్లెపు శీను, కే నాగాంజనేయులు, కే వెంకట సుబ్బయ్య, ఎస్.రామాంజనేయులు, రాజబాబు, కే శ్రీనివాసరావు, బలరాం రెడ్డి, గౌసాని, అల్లాబక్షు, మస్తాన్ వలి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సంతనూతలపాడులో రెవెన్యూ శాఖ అధికారి సుధీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, కొమ్మూరి కనకారావు, వైఎస్సార్ సీపీ నాయకులు

కౌలురైతు కార్డులు మంజూరు చేయాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

నాగులుప్పలపాడు: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు త్వరితగతిన మంజూరు చేయాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రావు అన్నారు. నాగులుప్పలపాడు మండలం వ్యవసాయ శాఖ కార్యాలయంలో కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రం మంజూరు చేసేందుకు విధి విధానాలపై గ్రామ రెవెన్యూ అధికారులకు, రైతు సేవా కేంద్ర సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపతహసీల్దార్ వాసుదేవరావు, మండల వ్యవసాయ అధికారి పోతినేని వెంకట్రావు, కేవీకే శాస్త్రవేత్త రమేష్ బాబు పాల్గొన్నారు. ఉప తహసీల్దార్ వాసుదేవరావు మాట్లాడుతూ భూ యజమానులు కౌలు రైతులకు సాగు హక్కు పత్రం ఇవ్వడం వలన భూమికి సంబంధించిన ఎటువంటి హక్కులు సంక్రమించవని అన్నారు. ఈ పత్రం కేవలం 11 నెలలకు మాత్రమే చెల్లుబాటు అవుతుందన్నారు. కేవీకే శాస్త్రవేత్త రమేష్ బాబు మాట్లాడుతూ తొలకరి వర్షాలు పడుతున్నాయని, ఇప్పుడు నువ్వులు, పచ్చిరొట్ట పంటల సాగు చేసుకోవచ్చని తెలిపారు. భూసార పరీక్షలు చేసుకోవడం ద్వారా భూమి లో ఉన్న లోపాలను గుర్తించి సరి చేసుకుని మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు తాలూకా పోలీసుల కౌన్సిలింగ్

ఒంగోలు టౌన్: నగరంలోని పాత నేరస్తులు, రౌడీ షీటర్లకు తాలుకా పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. బుధవారం తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న పాత నేరస్తులు, రౌడీ షీటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి తాలుకా సీఐ విజయ్ కృష్ణ వారితో మాట్లాడి వ్యక్తిగత వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఎటువంటి నేరాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పాత అలవాట్లను మార్చుకోవాలని, ఒక వ్యక్తి మీద రౌడీ షీట్ ఉన్నప్పుడు వారి కుటుంబంపై కూడా దాని ప్రభావం ఉంటుందని చెప్పారు. ప్రవర్తనను మార్చుకోకపోయినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, చట్టవ్యతిరేకంగా దౌర్జన్యాలు చేసినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సత్ప్రవర్తన ఒక్కటే పరిష్కార మార్గమని, సమాజంలో అందరితో కలిసి మెలసి జీవించాలని సూచించారు. కౌన్సిలింగ్‌లో ఎస్సైలు హరిబాబు, షేక్ ఫిరోజ్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ముస్లింలకు ఒరిగిందేమీ లేదు



ఎంఏ సాలార్ (ఫైల్)

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ముస్లింలకు ఎలాంటి లబ్ధి చేకూర్చలేదని ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ సాలార్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వక్ఫ్ బోర్డుకు ఇప్పటి వరకు అధికారిని నియమించకపోవడం వెనుక మతలబేమిటో చెప్పాలని ప్రశ్నించారు. సీఈఓగా గ్రూప్ వన్ అధికారిని నియమించడ సంగతి తర్వాత కనీస విద్యార్హతలున్న అధికారిని కూడా నియమించలేదని, ఇది కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఏడాదైనా ముస్లిం సమాజానికి ఒక్కటంటే ఒక్క రుణం కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. బ్యాంకు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఒకరికి కూడా ఇవ్వకుండా మభ్య పెడుతున్నారన్నారు. రంజాన్ విందుకు నిధులు కేటాయించకుండా హజ్ కమిటీ నిధుల్లో కోటిన్నర రీయింబర్స్‌మెంట్ కింద తీసుకోవడం కూటమికే చెల్లిందన్నారు. దాన్ని కూడా సక్రమంగా వినియోగించలేదని, అందులో సగాన్ని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమానికే ఖర్చు చేశారని ఆరోపించారు. ఆ సొమ్మును తిరిగి హజ్ కమిటీకి చెల్లించారో లేదో కూడా తెలియదన్నారు. ఈ ఏడాదిలో భర్తీ చేసిన ఎమ్మెల్సీ, రాజ్యసభ స్థానాల్లో ముస్లింలకు ఒక స్థానం కూడా కేటాయించలేదని, 100కు పైగా కార్పొరేషన్లను భర్తీ చేసినప్పటికీ మైనారిటీలకు చెందిన సంస్థలకు తప్ప మిగిలిన కీలక సంస్థలకు ఒక్కరిని కూడా నియమించలేదని తెలిపారు. 13 జిల్లా సహకార బ్యాంకులు, సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్లలో ఒక్క ముస్లింను నియమించలేదన్నారు. ఇదే విధంగా కూటమిలోని బీజేపీ ప్రభావంతో ముఖ్యమంత్రి చంద్రబాబు పని చేస్తున్నారేమో అనే సందేహం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా ముస్లిం సమాజానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, శ్రీనివాసరావు

మద్దిపాడు: పాఠశాలల కుకింగ్ ఏజంట్లు విద్యార్థులకు పరిశుభ్రమైన భోజనం అందించాలని ఎంఈఓలు ఎంవీఆర్ ఆంజనేయులు, ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. కుకింగ్ ఏజంట్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం బుధవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజంట్లు హెల్పర్లు వంట చేసే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విధిగా మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలన్నారు. ప్రభుత్వం అందించే నాణ్యమైన బియ్యాన్ని వాడి రుచికరంగా భోజనం తయారు చేసి విద్యార్థులకు అందించాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడానికి ప్రతి రోజు విజిట్లు ఉంటాయని తెలిపారు. ప్రధానోపాధ్యాయులతో జాగ్రత్తగా మసలుకుంటూ వారి సలహాలు, సూచనలు పాటించాల్సిందిగా కుకింగ్ ఏజంట్‌లకు తెలిపారు. కార్యక్రమంలో వారివెంట ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది సీఆర్‌పీలు కుకింగ్ ఏజంట్లు, హెల్పర్‌లు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్



రేషన్ బియ్యం పంపిణీ అనంతరం వృద్ధురాలితో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

సంతనూతలపాడు: సంతనూతలపాడులోని నాల్గవ రేషన్ షాపునకు సంబంధించి స్థానిక తూనుగుంట వారి వీధిలో బుధవారం జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ వృద్ధురాలు కొత్తపల్లి ఆదెమ్మకు స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు. గ్యాస్ సబ్సిడీ వస్తుందా, పెన్షన్ వచ్చిందా తదితర వివరాలను జేసీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ మాబు సుభాని, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్యలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమణ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ, రేషన్ డీలర్లు ఎస్.మాధవీలత, పీ నారాయణస్వామి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

క్విస్ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ప్రొఫెసర్ రామ్మోహన్‌రావు

ఒంగోలు సిటీ: నగరంలోని క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 2021–2025 బ్యాచ్‌కి చెందిన 1254 మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్లు అయినట్లు విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ నిడమానూరి శ్రీగాయత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ఈఎస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ నిడమానూరి శ్రీచరిత ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా క్విస్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతురావు కళాశాల వార్షిక నివేదిక చదివి వినిపించారు. అనంతరం వివిధ డిపార్ట్ మెంట్లలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 70 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు ప్రత్యేక జ్ఞాపికలు అందజేశారు. 1234 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ప్రొఫెసర్ కె.రామ్మోహన్‌రావు మాట్లాడుతూ క్విస్ కళాశాల మొత్తం తిరిగి చూశానని, అన్నీ సదుపాయలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ల్యాబ్‌లు, ఐడియా ల్యాబ్, స్కిల్ రూమ్స్, ప్రాజెక్ట్ రూమ్‌లన్నీ బాగున్నాయని మేనేజ్‌మెంట్‌ను అభినందించారు. కార్యక్రమానికి క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ సమీర్ కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించారు. కో కన్వీనర్లుగా సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు, కల్చరల్స్ డీన్ డాక్టర్ నవనీతన్ వ్యవహరించారు.